# పానకంలో పుడక

అడల్ట్స్ ఓన్లీ కథ!

A

ఎ.కె.వి. రత్నమాల

**పెళ్లయిన కొత్తల్లో దొరికే ఏకాంతం, గడిపే దాంపత్య జీవితం మల్లెపూల పాన్పులాంటివి. అందులో ముళ్లుండే ప్రసక్తే లేదు. ఒకవేళ విధి వక్రించి, దురదృష్టవశాత్తూ మల్లెల మధ్యన ముళ్లు మొలిస్తే.. అప్పుడు వాటిని తక్షణం ఏరిపారేయాలి. అదీ చాలా నిర్దాక్షిణ్యంగా నిర్మోహమాటంగా. ఇలా చేయడంలో తప్పేంలేదు.**

★ ★ ★

నీ బాణంబులు రాల, నీ ధనువు బంధీభూతమై పోవ నీ

జాబిల్లిన్ ఫణియంట, నీ బలములాశా వీధిపాలై చనన్

నీ బంట్రోతు తనంబు స్త్రీల యెడనే నిన్నెవ్వరున్ నవ్వరే

మా బాలామణి నేచబోకుద కటా మర్యాద గాదాత్మజా!

అంటే.. నీ బాణాలు రాలిపోను. నీ విల్లు ముక్కలైపోను. నీ చంద్రుణ్ని పాము కాటేయ. నీ బలగాలు దిక్కుల పాలుగాను. నీ పౌరుషం ఆడవారి విషయంలోనేనా? ఎవ్వరూ నిన్ను చూసి నవ్వరా? మా బాలామణిని బాధించబోకు. ఓ మన్మధా! నీకు మర్యాద కాదు సుమా! అని దానర్థం.

ఆ పద్యంలోని అంతరార్థం అవగతమయ్యేసరికి మనోజ్ఞ ముఖం సిగ్గుతో ఎర్రబడింది. తన మానాన తనని ఒంటరిగా వదిలేయకుండా వచ్చి, తన విరహాన్ని పసిగట్టి, సందర్భానికి తగ్గట్టుగా రసిక రసవత్తర పద్యాలు వదులుతూ తనని మరింత ఏడిపిస్తున్న వనజాక్షి వైపు గుర్రుగా చూసింది.

''ఏయ్! ఏవిటా చూపు?'' నడుం మీద చేతులేసుకుని నిలదీస్తున్నట్టుగా అడిగింది వనజాక్షి.

''దీన్ని కోపం అంటారు. ఇదంతా మీ మీదే!'' ఠక్కున జవాబిచ్చింది మనోజ్ఞ.

ఆ మాటలకి ఫక్కున నవ్వింది వనజాక్షి. ''కానీ నాకలా అనిపించలేదే. నీ చూపులు మరుని విరితూపుల్లా కనిపించాయి. అసలు ఎదురుగా నేను కాకుండా మీ ఆయనుంటేనా! నిన్నీపాటికి ఏం చెయ్యాలో అది చేసేసే వాడు'' కన్ను గీటుతూ కొంటెగా అందావిడ.

వింటున్న మనోజ్ఞకి చచ్చేంత సిగ్గేసింది. అంత సిగ్గులోనూ భర్త రసికత గుర్తొచ్చింది. వళ్లంతా ఝల్లుమంది. ''ఛీ! మీరెప్పుడూ ఇంతే! మరీ పచ్చిగా మాట్లాడేస్తారు'' మొహాన్ని అరచేతుల్లో దాచుకుంటూ మళ్లీ సిగ్గుపడిపోయింది.


ఆమెనలా చూస్తుంటే వనజాక్షికి ఏదోలా అనిపించింది. అంతలోనే అసలు విషయం గుర్తొచ్చింది. ''సరే! సిగ్గుపడింది చాలు కానీ, అసలు నేనిప్పుడు వచ్చింది ఎందుకో తెలుసా?'' వెళ్లడానికి ఉద్యుక్తురాలవుతూ అంది.

'తెలీదు' అన్నట్టు తల అడ్డంగా ఊపింది మనోజ్ఞ.

''నీకోసం వంకాయ కూర, ములక్కాడ సాంబారు తెచ్చాను. ఆ రెండూ డైనింగ్ టేబిల్ మీద పెట్టాను. వేసుకుని తిను'' చెప్పింది.

ఆవిడలా చెబుతుంటే మనోజ్ఞకి చాలా మొహమాటంగా అనిపించింది. ''అయ్యయ్యో! ఎందుకండీ ఇవన్నీ? నేను వంట చేసేశానుగా! మళ్లీ మీరెందుకు శ్రమ తీసుకున్నారు?'' నొచ్చుకుంటున్నట్టుగా అంది.

ఆ మాటలకి చిన్నగా నవ్వింది వనజాక్షి. ''ఇది శ్రమ కాదు సహాయం. ఈ పూట భోజనంలో ఈ రెండూ వేసుకుతిన్నావంటే సాయంత్రానికి నీకు ఫుల్లుగా మూడొచ్చేస్తుంది. అందుకే నా వంతుగా ఇవి నేను నీకు వండి తీసుకొచ్చేశాను'' నవ్వుతూ చెప్పింది.



మనోజ్ఞకి మళ్లీ సిగ్గేసింది. ఆ సిగ్గు ఆవిడకి కనపడకూడదన్నట్టుగా చటుక్కున తలొంచుకుంది. కానీ ఆమె ఎంత జాగ్రత్త పడ్డా ఆ దృశ్యం ఆవిడ దృష్టిని దాటిపోలేదు. అది చూసి మళ్లీ నవ్విందావిడ.

''సర్లే! ఇక నువ్వు తలుపులేసుకుని తీరిగ్గా సిగ్గుపడు నే వెడుతున్నా!'' చెప్పేసి బయటకి వెళ్లిపోయిందావిడ.

పెద్దావిడని పూర్తిగా వెళ్లనిచ్చి, వీధి తలుపు వేసి లోపలకొచ్చి మంచం మీద వాలిపోయింది మనోజ్ఞ.

నిజానికి వనజాక్షికీ మనోజ్ఞకీ మధ్య బంధుత్వం ఏదీ లేదు. అసలా మాటకొస్తే మనోజ్ఞ దంపతులు ఆ ఇంట్లో అద్దెకి దిగి

ఇంకా పూర్తిగా వారం రోజులు కూడా కాలేదు. వాళ్లిద్దరూ కేవలం పక్క పక్క ఇళ్లవాళ్లు మాత్రమే! అయినా సరే వచ్చిన రెండో రోజునే చనువుగా ఆమెతో మాట కలిపింది వనజాక్షి.

వయసులో తనకంటే ఎంతో పెద్దదైన ఆవిడని చూసేసరికి తన తల్లే గుర్తొచ్చింది మనోజ్ఞకి. ''పిన్నిగారూ!'' అంటూ వరస కలిపేసి వనజాక్షికి మరింత దగ్గరైపోయింది. అలా మొదలైన వాళ్ల పరిచయం.. ఏ సమయంలో పడితే ఆ సమయంలో వనజాక్షి, నిరభ్యంతరంగా మనోజ్ఞ ఇంట్లోకి దూసుకు రాగలిగేంత వరకూ వచ్చింది.

అసలే ఆవిడ 'ఇలాంటి' విషయాల్లో ఘనాపాఠి. అవతలి వాళ్ల బాధనీ వేదననీ అరక్షణంలో గ్రహించగలిగేటంతటి దిట్ట! అటుపైన వనజాక్షి వయసులో వుండగా భర్తతో సరసం విషయంలో ఎలా ఉండేదో తెలీదుగానీ సాహిత్యంలో మాత్రం సమర్థురాలు. అప్పట్లో వాళ్ల నాన్నగారి ప్రోద్బలంతో 'భాషాప్రవీణ' తెలుగులో చదివించారు. అందుకే నోట్లో ఎప్పుడూ ఏదో ఓ పద్యం నానుతూనే వుంటుంది.

అందుకు తగ్గట్టే మనోజ్ఞ మౌద్గల్యలది కొత్త కాపురం. అలాంటి కాపురంలో 'భాగస్వామి' అరక్షణం కనుమరుగైనా అది దుర్భరమనిపించడం, దుస్సహమైన విరహాగ్నిని రగల్చటం సహజమే! అలా తాపంలో మునిగిపోతూ, విరహంతో వేగిపోతూ మనోజ్ఞ, వనజాక్షి కంటపడడం, ఆమెని ఏదో ఓ పద్యంలో వనజాక్షి ఆట పట్టించడం వాళ్లిద్దరికీ సర్వసాధారణమైపోయింది. సందర్భానికి తగ్గట్టుగా పద్యాలు చదివే వనజాక్షి గుర్తురావడంతో మనోజ్ఞకి నవ్వొచ్చింది. ముసిముసిగా నవ్వుకుంది.

ఇంతలో...

ఠంగున ఓ గంట కొట్టింది గోడ గడియారం. తలెత్తి చూస్తే టైము పదకొండున్నర. ఆకలి కాకపోయినా అసలు తినాలని లేకపోయినా రోజూ వేళకి భోజనం చేయడం ఆమెకున్న అలవాటు. ఆ రివాజుతోనే లేచి ఏవో నాలుగు మెతుకులు కెలికింది. తిని మంచం మీద వాలగానే భర్త గుర్తొచ్చాడు. అతను చేసే చిలిపి పనులు గుర్తొచ్చాయి. ఒళ్లు వేడెక్కింది. ఆ వెంటనే భర్త కావాలనిపించింది. అతను హఠాత్తుగా ఆఫీసుని వదిలిపెట్టి తనకోసం వచ్చేస్తే బావుండనిపించింది. ఆ ఆశతోనే చప్పుడవకపోయినా వెళ్లి తలుపు తీసి చూసింది. కానీ అతనక్కడ లేడు. మనసులో ఉన్న అతన్ని తక్షణం ఇంటికి రప్పించుకోవడం సాధ్యం కాక నిస్సహాయంగా అనిపించిందామెకి. తలుపు వేసి కాళ్లీడ్చుకుంటూ వెళ్లి మంచానికి అడ్డుపడిపోయింది. అప్పట్నుంచీ క్షణమొక యుగంగా భారంగా కాలం గడవడం ప్రారంభించింది.

ఎట్టకేలకు సాయంత్రం అయింది.

ఐదున్నర కాగానే అతనొచ్చేశాడు. రావడం రావడమే సుడిగాలితో కూడిన జడివానలా దూసుకొచ్చేశాడు. వస్తూనే.. ఓ చేత్తో గుమ్మం దగ్గరే నిలబడి ఆశగా తన కోసం ఎదురుచూస్తున్న భార్య నడుముని చుట్టేసి, ఆత్రంగా ఆమెని లాక్కొచ్చేసి ఆ వెంటనే తలుపు వేసేశాడు.

''కొత్త బిచ్చగాడు పొద్దెరగడని ఏవిటీ ఆత్రం?'' చిరుకోపంగా అందామె. అతను వినిపించుకోలేదు.

తన ధోరణిలో తానున్నట్టుగా రెండు చేతులతోనూ ఆమెని చుట్టేసి ఆత్రుతగా భార్య పెదవుల్ని అందుకున్నాడు. ఆ ఎర్రని అధరాల్ని తన పెదవుల్తో గట్టిగా వత్తి- ఆ వేడిలోంచి పుట్టే అమృతాన్ని జుర్రుకునే పీక్ టైంలో ఉండగా.. టకటకమంటూ చప్పుడైంది తలుపు.

తమ హడావిడిలో తామున్న ఆ ఇద్దరికీ మొదట ఆ చప్పుడు వినిపించలేదు. మళ్లీ రెండోసారి చప్పుడైంది తలుపు. ఒక్కసారే ఉలిక్కిపడ్డారిద్దరూ. ఆ వెంటనే.. ''అమ్మాయ్ మనూ!'' అంటూ వనజాక్షి గొంతు వినబడడంతో అదిరిపడి దూరంగా జరిగారు.

ఆ టైమ్‌లో ఆవిడలా రావడం అతనికి చాలా విసుగు తెప్పించింది. ''ఇప్పుడు ఈవిడెందుకొచ్చినట్టు?'' ముఖం చిట్లించి అడిగాడు భార్యని.

మనోజ్ఞ పెదవి విరిచింది తనకేం తెలీదన్నట్టుగా!

''సరే! ఆవిడెందుకొచ్చిందో కనుక్కుని వెంటనే పంపించేయ్. నీ కోసం నేను బెడ్‌రూంలో వెయిట్ చేస్తుంటాను'' చెప్పేసి లోపలికి వెళ్లిపోయాడు అతను.

అప్పుడు.. తలుపు తెరిచి పిన్నిగార్ని సాదరంగా ఆహ్వానించింది మనోజ్ఞ.

''తలుపు తియ్యడానికి ఇంతాలస్యం అయిందేం?'' లోపలికి వస్తూనే దీర్ఘం తీసింది వనజాక్షి.

సూదుల్లాంటి చూపుల్తో నఖశిఖ పర్యంతం తననే గమనిస్తూ ఆవిడలా అడుగుతుంటే ఏం చెప్పాలో అర్థం కాక తత్తరపడింది మనోజ్ఞ. ''అబ్బే.. ఏం లేదు. లోపల ఆయనకి కాఫీ పెట్టే పన్లో వున్నాను. అందుకే లేటయింది'' తడబడుతూ అంది.

కానీ వనజాక్షి నమ్మలేదా మాటల్ని. ''నీ జుట్టు రేగింది. పైట చెదిరింది. కళ్లు కూడా కాస్త అదోలా ఎర్రబారాయి. దీన్నిబట్టి చూస్తుంటే నా అంచనా ప్రకారం మీరిద్దరూ ఈ తలుపుని దాటి అవతలికి వెళ్లుండరు. నిజమేనా?'' నిలదీస్తున్నట్టుగా అడిగింది.

## తప్పనిసరి

మోడలింగ్‌నుంచి బాలీవుడ్‌కొచ్చిన భామ యానాగుప్తా. ఆమె తన ప్రవర్తనతో బాలీవుడ్ హెలెన్ అన్పించుకుంటోంది. షూటింగుల్లో ఉన్నప్పుడు కూడా ఆమె తనకెంతో ప్రైవసీ కావాలంటోందిట. తన మేకప్ రూంకి తాళం వేసుకుని మరీ గంటల తరబడి బయటికి రాకుండా ఉంటున్న యానా వైఖరిని సినీజనాలు, పత్రికలు కూడా విమర్శిస్తున్నాయి. సినీరంగంలో నాకు మంచి గుడ్‌విల్ ఉంది. దాన్ని పదికాలాలపాటు నిలబెట్టుకోవాలంటే ఇలాంటి పద్ధతి తప్పనిసరి అంటోంది యానా. నటీనటుల ఇష్టాయిష్టాల్ని కాపాడాల్సిన బాధ్యత చిత్ర యూనిట్‌తో పాటూ మీడియాకి కూడా ఉంటుందంటోంది యానా.



సమాధానం చెప్పడానికి మనోజ్ఞకి నోరు పెగల్లేదు.

ఆమెనలా చూస్తూ, విషయం అర్థమైన దానిలా చిన్నగా నవ్వింది వనజాక్షి. ''పిచ్చిదానా! ఇలాంటి అనుభవాలు నీకే కాదు, గతంలో నాకూ ఎదురయ్యాయి. అసలోసారి ఏం జరిగిందో తెలుసా.. మీ బాబాయ్‌గారు..'' అంటూ మొదలెట్టి, తమ పెళ్లయిన కొత్త రోజుల్నీ ఆ రోజుల్లో వనజాక్షి మొగుడుగారి రసికతనీ, చెప్పడం ప్రారంభించింది.

ఆ కథల్ని వింటున్న మనోజ్ఞ సంగతి ఏమోగానీ, ఆమె కోసమే బెడ్‌రూంలో కాలుగాలిన పిల్లిలా పచార్లు చేస్తున్న మౌద్గల్యకి మాత్రం మతిపోయింది. అక్కడికీ పావుగంట చూశాడు. అరగంట ఆగాడు. ఎప్పటికీ పిన్నిగారి కథాకాలక్షేపం పూర్తి కాకపోయేసరికి చిరాకు ఎక్కువై, అసహనంగా ఓ కేక పెట్టాడు.. ''మనూ! ఓసారిలా వస్తావా?'' అంటూ.

ఆ కేకలో ధ్వనించిన కోపానికి ఆడాళ్లిద్దరూ ఒక్కసారే ఉలిక్కిపడ్డారు. ఆ వెంటనే కంగారుగా వనజాక్షి మొహంలోకి చూసింది మనోజ్ఞ. ఆ కేక విని ఆవిడ ఏమనుకుంటుందో అన్నట్టు.

ఆమె చూపుల్లోని అంతరార్థం గ్రహించి చిన్నగా నవ్విందావిడ. ''మీ ఆయనకి కోపం వచ్చినట్టుంది'' అంది ఇంకా నవ్వుతూనే.

''అవును'' చెప్పేసి కూర్చున్న చోటు నుంచి దిగ్గున లేచి బెడ్‌రూంలోకి పరుగెత్తబోయింది మనోజ్ఞ.

జరగబోయేది గ్రహించి మెరుపులా రియాక్టయింది వనజాక్షి. వెళ్లబోతున్న మనోజ్ఞని చప్పున చెయ్యి పట్టి ఆపేసింది. ఊహించని ఆ హఠాత్సంఘటనకి బిత్తరపోయిందామె.

''వదలండి పిన్నిగారూ! ఆయన పిలుస్తున్నారు'' అంది తత్తరపాటుగా.

## దూరం కష్టం


**మోడల్‌గా, నర్తకిగా ఎంతో అనుభవాన్ని సంపాదించిన అసిన్ తెలుగు సినిమాల్లో నటించి అందరీ అభిమానాన్ని సంపాదించుకుంది. చేపల కూర, కేరళ ఫుడ్ ఎక్కువగా తినే అసిన్ జీన్స్, టీ షర్ట్‌లు ఎక్కువగా ధరిస్తుంది. సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువగా ఉండే అబ్బాయిల్ని తానెక్కువగా ఇష్టపడతానని చెప్పే అసిన్ ఇంగ్లీషులో గ్రాడ్యుయేషన్ చేసింది. అందుకేనేమో ఇంగ్లీషులో గలగలా మాట్లాడుతుంది. బాలకృష్ణతో 'లక్ష్మీనరసింహ'లో నటిస్తున్న అసిన్‌ని తెలుగు ప్రేక్షకులు బాగానే ఆదరిస్తున్నారు. ముమ్ముందు ఆ ఆదరణ ఎలా ఉంటుందో చూడాల్సిందే.**

''ఆయనగారు పిల్చేది 'అందుకే'గా'' కళ్లెగరేస్తూ అదోలా అడిగింది వనజాక్షి, ఆమె చేతిని వదలకుండానే.

వెయ్యి ఓల్టుల షాక్ తగిలింది మనోజ్ఞకి. అన్నీ తెలిసి కూడా ఆవిడలా ఎందుకు ప్రవర్తిస్తోందో అర్థం కాలేదు. అయోమయంగా వనజాక్షి వైపు చూస్తుంటే, ఆమె భావాలు గ్రహించిన దానిలా మళ్లీ తనే అందావిడ-

''పిచ్చిదానా! అతనొస్తాడనీ, వచ్చిరాగానే తొందరపడతాడనీ తెలుసు నీకు. అన్నీ తెలిసి కూడా ఇలా.. జిడ్డు మొహంతో ఉండిపోవడం తప్పుకాదూ! ఇప్పుడీ అవతారంతోనే బెడ్‌రూంలోకి వెళితే ఏం బావుంటుంది? అసలు నీ మొగుడి ప్రేమ నీ పట్ల ఎప్పుడూ నిత్యనూతనంగా ఉండాలంటే ఇలా వెళ్లకూడదు. శుభ్రంగా స్నానం చేసి, తెల్లచీర కట్టుకుని తల్లో పూలతో అప్పుడు వెళ్లు.. బావుంటుంది'' అనునయంగా చెప్పింది.

కానీ ఎందుకో.. ఆవిడ మాటలు మనోజ్ఞకి అస్సలు రుచించడంలేదు. ప్రస్తుతం తానున్న ఆత్రంలో పిన్నిగారు చెప్పిన పనులన్నీ పూర్తి చేసుకుని తీరిగ్గా వెళ్లడం



అసాధ్యం. ఒకవేళ ఎలాగో కాస్సేపు మనసుని నిగ్రహించుకుని ఆ పని చేద్దామన్నా అంతవరకూ అతనూ ఆగడు. ఆ మాటే ఆవిడతో అనెయ్యాలని అనుకునే లోపు ఆమె కంటే ముందుగా వనజాక్షే నోరు తెరిచింది.

''చూడబ్బాయ్! నువ్వెంత కంగారుపడుతున్నావో నాకు తెలుసు కానీ మీ ఆవిడ ఇప్పుడే నీ దగ్గరికి రాదు. తను ముస్తాబయి బెడ్‌రూంలోకి వచ్చేసరికి ఓ అరగంట ఆలస్యమవుతుంది. అందాకా కాస్త ఓపిక పట్టు'' బెడ్‌రూం వైపు తిరిగి, మౌద్గల్యకి వినిపించేలా చెప్పేసి మనోజ్ఞని చెయ్యి పట్టి లాక్కుంటూ అక్కడి నుంచీ తీసుకెళ్లిపోయింది.

ఆ క్షణంలో ఆవిడంత పచ్చిగా మాట్లాడేసరికి వింటున్న మౌద్గల్య శరీరం మొత్తం సిగ్గుతో చచ్చిపోయింది. ఓ క్షణంలో తలకొట్టేసినంత పనయింది కూడా. ఎందుకో చాలాసేపటి వరకూ ఆ షాక్‌లోంచి తేరుకోలేకపోయాడతను. తీరా తేరుకుని తెప్పరిల్లి చూసేసరికి.. ఎదురుగా తెల్లచీర, తల్లో పూలతో దేవకన్యలా కనిపించింది మనోజ్ఞ. కానీ ఏం లాభం? ఆమెని అనుభవించడానికీ ఆ అందాల్ని ఆస్వాదించడానికీ అతనికే మూడ్ లేకుండా పోయింది.

ఆ తతంగం అక్కడితో ఆగిపోలేదు. అది లగాయతూ- చనువు పేరుతో, సహాయం వంకతో వనజాక్షి అనుక్షణం వాళ్లకి అంతరాయం కలిగించడం ప్రారంభించింది. వద్దంటే వినదు. ఆగమంటే ఆగదు. అతను లేనప్పుడంతా మనోజ్ఞని పదేపదే వాళ్ల సరసాలకి సంబంధించిన విషయాల్ని గుచ్చి గుచ్చి అడగడం.. ఆట పట్టించడం.. తీరా అతనే వచ్చి ఆ విషయాల్ని నిజం చేసే లోపు తానే పానకంలో పుడకై వాళ్లిద్దరికీ అడ్డుపడడం.. ఇవన్నీ వనజాక్షి దినచర్యలో భాగాలైపోయాయి.

మొదట్లో అదంతా కాకతాళీయంగా జరుగుతోందేమో అనుకున్నారు మనోజ్ఞ దంపతులు. ఆ తర్వాత ఆ ప్రవర్తనంతా వయసు మీద పడడం వల్ల వచ్చిన చాదస్తమేమో అని సరిపెట్టుకున్నారు. అటుపైన.. ''పోన్లే పెద్దావిడ. ఏదైనా అంటే నొచ్చుకుంటుంది'' అని ఆలోచించి రాజీ పడ్డారు. కానీ బాగా గమనిస్తే అప్పుడర్థమైంది వాళ్లకి... వనజాక్షి అసలిదంతా కావాలనే చేస్తోందని. అసలు విషయం గ్రహింపుకొచ్చేసరికి నెత్తిన పిడుగులు పడ్డట్టుగా అదిరిపోయారా ఇద్దరూ! మొదట ఏం చేయాలో ఇద్దరికీ పాలుపోలేదు.

''అయితే ఇప్పుడేం చేద్దాం?'' బేలగా అడిగింది మనోజ్ఞ.

''ఇల్లు ఖాళీ చేసేద్దాం'' చెప్పాడు మౌద్గల్య. బాగా ఆలోచిస్తే అదొక్కటే పరిష్కారం అనిపించిందతనికి.

అది విని గాఢంగా నిట్టూర్చింది మనోజ్ఞ. ''సమస్యకి పలాయనం పరిష్కారం కాదు. అక్కడ మాత్రం ఇలాంటి వాళ్లు మరొకళ్లు వుండరన్న నమ్మకం ఏమిటి?'' ప్రశ్నించింది.

''అలాగైతే ఇంకొక్కటే మార్గం మిగిలింది'' కాసేపు ఆలోచించి అన్నాడతను.

''ఏమిటో చెప్పండి'' ఆత్రంగా అడిగింది.

''ఆ వనజాక్షిని హత్య చేయడం'' కసిగా అన్నాడతను.

అదిరిపడింది మనోజ్ఞ. ఎందుకో ఉన్నట్టుండి ఆమెకి దుఃఖం ముంచుకొచ్చింది. అతని ఒళ్లో తల పెట్టుకుని ఏడుస్తూ ఉండిపోయింది. ఒకటి కాదు, రెండు కాదు దాదాపు పదిహేను రోజుల నుంచీ పిన్నిగారి మూలంగా సరైన ముద్దు ముచ్చట్లు లేక పరితపించిపోతున్న బెంగ, బాత్రూం, బెడ్రూం, వంటిల్లు పడకిల్లు తేడా లేకుండా సాగే సరస సల్లాపాలు కాస్తా, ఏ అర్ధరాత్రిలోనో అపరాత్రిలోనో ఏదో అయిందనిపిస్తున్న అసంతృప్తి సంసారంగా మారడంతో కలిగిన విరక్తి.. వెరశి.. కన్నీరుగా మారి కాల్వలుగా పారి బయటకి వెళ్లిపోవడంతో కాసేపటికి తెప్పరిల్లిందామె. గుండెలోని బరువంతా దిగిపోవడంతో అప్పుడు మెదడు చురుగ్గా పనిచేయడం ప్రారంభించింది. సరిగ్గా అలాంటి సమయంలోనే వచ్చిందో ఆలోచన! అదలా రావడమే ఆలస్యం ''ఐడియా'' అంటూ అరిచింది మనోజ్ఞ.

''ఏవిటది?'' మామూలుగా అడిగాడతను.

చెప్పిందామె.

వినడానికే మహాద్భుతంగా ఉంది. అలాంటిది ఆచరణలో పెడితే ఇంకెంత బావుంటుందో! అనిపించిందతనికి. ''ఇదేదో బావుంది. అలాగే చేద్దాం'' అన్నాడు మెరుస్తున్న కళ్లతో.

సమస్యకి పరిష్కారం దొరకడంతో ఇద్దరి మనసులూ తేలిక పడ్డాయి. కూర్చున్న చోటు నుంచీ లేచి, రిఫ్రెష్ అయి చెట్టాపట్టాలేసుకుని చిలకాగోరింకల్లా మార్కెట్‌కి బయల్దేరారు. వనజాక్షిని ఖంగుతినిపించే 'సరంజామా'ని కొనుక్కోవడం కోసం.

★ ★ ★

యథాప్రకారం తెల్లారింది. ఎప్పటిలానే సూర్యుడు తూర్పున ఉదయించకుండానే మనోజ్ఞ దంపతుల మధ్యకి జొరబడిపోయింది వనజాక్షి. ''ఇవాళ వంటేం చేస్తున్నావ్ అమ్మాయ్? వంటింట్లో నేనేవయినా సాయం చేసేదా?'' అంటూ.

ఒకవేళ తనలా చొచ్చుకుపోయినా, స్వతహాగా మొహమాటం మనిషైన మనోజ్ఞ తన చేత ఏ పనీ చెయ్యనివ్వదని ఆవిడకి బాగా తెలుసు. అందుకే అంత ధీమాగా వచ్చేసింది.

కానీ మనోజ్ఞ ఆలోచన వేరుగా ఉంది. అందుకే ఆవిడలా రావడమే ఆలస్యం, ముందు రోజు రాత్రి నానబెట్టి ఉంచిన అర కేజీ బియ్యం, పావుకేజీ మినప్పప్పు తీసి ఆవిడ చేతిలో పెట్టేసింది ''నాక్కాస్త ఈ అట్ల పిండిని రుబ్బి పెడుదురూ'' అంటూ! అక్కడితో ఆగకుండా ''సారీ పిన్నిగారూ! రాత్రి మిక్సీ చెడిపోయింది. అందుచేత ఆ నాలుగు బియ్యపు గింజలూ రెండు పప్పుబద్దల్నీ ఇందులో రుబ్బెయ్యండి'' అంటూ పెద్ద రుబ్బురోలుని ఆవిడకి చూపించింది.

కలలో కూడా ఊహించని ఆ హఠాత్పరిణామానికి వనజాక్షి బిత్తరపోయింది. బియ్యం, పప్పు కలిపితే దాదాపు ముప్పావు కేజీ మిశ్రమం. దాన్ని రోట్లో రుబ్బడం, అందునా మెత్తని దోశల పిండిగా రుబ్బాలనేసరికి ఆవిడకి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. ఆ పరిస్థితి నుంచి ఎలా బయటపడాలో ఆవిడకి పాలుపోలేదు. అప్పుడు.. చప్పున స్ఫురించింది అసలు విషయం. ''పోన్లే! మీ మిక్సీ పాడైపోతే ఏం మా మిక్సీ పట్టుకొస్తాను'' అంటూ ముందుకి కదలబోయింది.

కానీ మనోజ్ఞ ఆవిణ్ణి కదలనివ్వలేదు. ''ఏమిటి పిన్నిగారూ! ఈ కాస్త రుబ్బడం ఎంతసేపనీ? మీ అంతటి పనిమంతురాళ్లకిది క్షణాల మీది పని. అయినా అట్లపిండి రోట్లో రుబ్బుకుంటేనే బావుంటుంది. అట్లు చాలా రుచిగా వస్తాయి'' అంటూ బలవంతాన ఆవిడ రెక్కపట్టి రోటి ముందు కూర్చోబెట్టేసింది.

''అవునండీ! అయినా మీ అమృత హస్తాల్తో అట్ల పిండి రుబ్బితే ఆ రుచే వేరు. నేను ఆణిముత్యాల్లాంటి పద్యాలు చదువుతుంటాను, అవి వింటూ మీరు ఆనందంగా మినప్పిండి రుబ్బెయ్యండి ఏం?'' ఎటు నుంచి వచ్చాడో ఏమో వచ్చి రోలు పక్కనే చతికిలబడుతూ అన్నాడు మౌద్గల్య.

అగ్నికి ఆజ్యంలా భార్యాభర్తలిద్దరూ ఒకటయ్యేసరికి, ఇక ఏడవ లేక నవ్వుతూ పిండి రుబ్బడం ప్రారంభించింది వనజాక్షి. ఐదు నిమిషాలకే రోట్లో పిండిని రుబ్బలేక నానా అవస్థలూ పడసాగిందామె. ఆపసోపాలు పడుతున్న ఆవిడని చూస్తూ- అప్పుడు మొదలెట్టాడు మౌద్గల్య.. తాను అంతకు ముందురోజు కొనితెచ్చిన 'చాటుపద్యమంజరి'లో వెదికి పట్టుకుని రాత్రంతా బట్టీ పట్టిన పద్యాల్ని చదవడం..

''చదువదెంత యున్న సంస్కారమింతగ
నెరుగకున్న నదియు చదువుగాదు
పరిమళమ్ము లేక పసలేదు పూలకు
వినుర శ్రీనివాస! విబుధ సూక్తి'' అంటూ

పద్యం వింటున్న వనజాక్షి ముఖంలో రంగులు మారడం ప్రారంభించాయి. ఓ క్షణంలో అసలా పద్యం తనని ఉద్దేశించి చదివిందేనేమో అన్న అనుమానం కూడా ఆవిడకి రాకపోలేదు.

ఆవిడ ముఖకవళికల్ని చూసేసరికి మౌద్గల్యకి చెప్పలేనంత హుషారొచ్చింది. ఆ ఉత్సాహంలోనే మరో పద్యం అందుకున్నాడు.

''పోకలు నమలుచు ఆకులు చేబూని
సున్నమడుగు వాడు శుద్ధవెధవ!
ఇద్దరు ఒకచోట ఏకాంత మాడంగ
వద్ద చేరెడు వాడు వట్టి వెధవ..'' రెట్టించిన ఉత్సాహంతో అతనలా చదువుకు పోతుంటే అవన్నీ తనని ఉద్దేశించి చదువుతున్నవేనన్న నిజం వనజాక్షికి అర్థమైపోయింది. తలకొట్టేసినంత అవమానంగా అనిపించింది. దాన్ని భరించలేనట్టుగా రుబ్బుతున్న పిండిని అలాగే వదిలేసి దిగ్గున లేచింది.

''ఏవిటి పిన్నిగారూ లేచారు?'' కంగారు నటిస్తూ అడిగింది మనోజ్ఞ.

''అబ్బే ఏం లేదు. ఇందాక పొయ్యి మీద పులుసు పెట్టేసి వచ్చినట్టు గుర్తు. అందుకే వెళుతున్నా'' చెప్పేసి హడావిడిగా ముందుకి కదిలింది వనజాక్షి.

తమ దెబ్బకి ఠారెత్తిపోయి, పిండి చెయ్యిని కడుక్కోకుండానే బయటకి పరుగెడుతున్న ఆవిడని చూసి పడీపడీ నవ్వుకున్నారు మనోజ్ఞ-మౌద్గల్య.

నిజానికి వనజాక్షి ఊరికే ఇతరులకి సహాయం చేసేంత మంచిదీ కాదు, భార్యాభర్తల గురించి తెలియని అమాయకురాలూ కాదు. కచ్చితంగా చెప్పాలంటే అన్యోన్యంగా, సరదాగా ఉండే కొత్త దంపతుల్ని చూసి భరించలేని అసూయాపరురాలు మాత్రమే. ఆవిడ దృష్టిలో సహాయమనేది సాకు మాత్రమే. దాని వెనకున్న అంతిమ లక్ష్యం భార్యాభర్తల ఏకాంతాన్ని భగ్నం చేయడం. కేవలం ఆవిడ పోరును భరించలేకనే వచ్చిన నాలుగో రోజునే ఆ ఇంటిని ఖాళీ చేసి పారిపోయిన దంపతులున్నారు. ఆవిడ గురించి విని ఆ ఏరియాకి రావడం మానేసిన జంటలున్నారు. కానీ ఆ కథని మనోజ్ఞ దంపతులు తిరగరాశారు.

అవునుమరి! పెళ్లయిన కొత్తలో గడిపే దాంపత్యజీవితం మల్లెపూల పాన్పులాంటిది. దాంట్లో ముళ్లుండే ప్రసక్తే లేదు. ఒకవేళ దురదృష్టవశాత్తూ మల్లెల్లో ముళ్ళు మొలవడం ప్రారంభిస్తే వాటిని చూస్తూ ఏ జంటా ఊరుకోదనేది నిస్సంశయం. అది కలిగించే బాధల్ని ఏ జంటా సహించలేదనేది నిస్సందేహం! వాటిని నిర్మొహమాటంగా ఏరిపారేయడమో నిర్దాక్షిణ్యంగా నరికేయడమో చేసి తీరుతారనేది నిర్వివాదాంశం! అందుకు ఈ కథే తార్కాణం!

☆

